సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 16 । నవంబర్ । 2024



మహాప్రసాదం

భీమవరం ఉమా సోమేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు మహా ప్రసాదం స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 10లో



విదేశీ అతిథులు

నత్తగొట్టేళ్లుగా పిలిచే విదేశీ కొంగలు పెంటపాడు మండలంలో సందడి చేస్తున్నాయి. ఇక్కడే సంతానోత్పత్తి చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళతాయి. 10లో



మామిడి పూతను కాపాడండిలా

ప్రస్తుతం మామిడి పూత ప్రారంభమవుతుందని, సరైన జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. 10లో

న్యూస్‌రీల్

క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో...



స్వామిని దర్శించుకున్న వాణీమోహన్

పాలకొల్లు సెంట్రల్ : పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని ప్రిన్సిపల్ సెక్రటరీ (జీఏడీ అండ్ ఏఆర్) జి.వాణీమోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

కొండచిలువల సయ్యాట



ద్వారకాతిరుమలలో కొండచిలువల సయ్యాట

ద్వారకాతిరుమల : క్షేత్ర పాలకుడైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో రెండు సర్పాలు శుక్రవారం ఉదయం సయ్యాటలాడాయి. కార్తీక పౌర్ణమినాడు సర్పాలు సయ్యాటలాడుతూ కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సాధారణంగా తాచు, జెర్రిపోతు పాములు సయ్యాటలాడటం చూస్తుంటాం. కానీ అందుకు భిన్నంగా ఒకే జాతికి చెందిన రెండు కొండచిలువలు సయ్యాటలాడడాన్ని చూసి భక్తులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తమ సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు పెంద్ర వీరన్న

నరసాపురం రూరల్ : ట్రైబల్ ఎంక్వయిరీ కమిటీ చైర్మన్ వెన్నెలగంటి రాఘవయ్య రిపోర్టును అనుసరించి సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పదిశాతం రిజర్వేషన్ల అమలు చేయాలని ఏపీ సంచార జాతుల రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పెంద్ర వీరన్న మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్‌లను కలిసి డిమాండ్లతో కూడిన వినతులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చల్లా రామయ్యను ప్రకటించినట్లు వీరన్న పేర్కొన్నారు. సభలో సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి అనపర్తి ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి అన్నప్పరెడ్డి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళనలు

భీమవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19, 20 తేదీల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ ప్రసాద్, అల్లం సత్యనారాయణ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోడం దారుణమన్నారు. డిమాండ్ల సాధన కోసం జిల్లాలోని 4 ఆర్టీసీ డిపోల వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులు హాజరుకావాలని, టీ విరామ సమయంలో గేట్ మీటింగ్‌లు ఏర్పాటుచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, సకాలంలో డీఏలు ఇవ్వాలని, పేస్కేల్‌తో మెరుగైన వేతన సవరణ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఆందోళనలు చేపడుతున్నట్లు నేతలు తెలిపారు.

18న ఆశ వర్కర్ల ధర్నా

భీమవరం : ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జీవోలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశ వర్కర్లంతా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పెనుగొండ : ఆచంట రామేశ్వర స్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం



భీమవరం(ప్రకాశంచౌక్) : శ్రీఉమాసోమేశ్వర స్వామికి అభిషేకం



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామంలో కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హర హర మహాదేవ

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. శివుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విశేష అభిషేకాలు, పూజాధికాలు జరిపారు. మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తి ప్రపత్తులను చాటారు. భీమవరం పంచారామ క్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామునుంచే శ్రీఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష పత్రి పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం శంకరమఠంలో చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉన్న స్ఫటిక లింగేశ్వరుడికి వివిధ పూజాదికాలు నిర్వహించారు. పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున మహిళలు కాలువ గట్టున కార్తీక దీపాలు వెలిగించారు. ఆచంటశ్రీఉమా రామేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి అఖండ జ్యోతి(కర్పూర జ్యోతి) ప్రజ్వలన వేడుకగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి నాడు వెలిగించిన అఖండ జ్యోతి మహాశివరాత్రి వరకూ నిరాటంకంగా జ్వలిస్తూ ఉంటుంది. దీంతో జ్యోతి ప్రజ్వలనకు వేలాది మంది భక్తుల శివనామస్మరణతో హోరెత్తించారు. కర్పూర జ్యోతిలో నెయ్యి వడ్డించడానికి పోటీ పడ్డారు. కర్పూర జ్యోతి అనంతరం జ్వాలా తోరణం వెలిగించి ప్రభను ఊరేగించారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం : స్ఫటికలింగేశ్వరుడికి నాగవల్లి పుష్పాలంకరణ



పెనుగొండ : ప్రత్యేక అలంకరణలో ఆచంటేశ్వరుడు



పెనుగొండ : ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో అఖండ జ్యోతిలో ఆవు నెయ్యి వేస్తున్న భక్తులు

తీపర్రులోనూ తప్పని తిప్పలు

- జిల్లాలో మూతపడిన ఇసుక ర్యాంపులు
- జిల్లా అవసరాల కోసం తూర్పుగోదావరి జిల్లా తీపర్రు ర్యాంపు కేటాయింపు
- లారీకి రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అదనపు వసూళ్లు
- వినియోగదారులపై వెయిటింగ్ చార్జీల భారం
- నిర్ణయించిన దానికన్నా రెట్టింపు ధరతో నష్టపోతున్న ప్రజలు



తీపర్రు ర్యాంపులో లోడింగ్



ఇసుక కోసం బారులు తీరిన లారీలు

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లాకు ఇసుక ర్యాంపులు లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లా తీపర్రు ర్యాంపును కేటాయించారు. ఈ ర్యాంపు నుంచి ఇసుక తెప్పించుకోవాలంటే భయపడుతున్నారు. నిర్ణయించిన దానికన్నా రెట్టింపు ధరకు కొనాల్సివస్తుందని నిర్మాణదారులు వాపోతున్నారు. తీపర్రు ర్యాంపు నుంచి ఆకివీడుకు మధ్య దూరం సుమారు 63 కిలోమీటర్లు. ఐదు యూనిట్ల ఇసుకకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.1924 లోడింగ్, రూ.10,710 రవాణా చార్జీ కలిపి వినియోగదారుడికి రూ. 12,634కు చేరాలి. ర్యాంపు వద్ద అనధికార వసూళ్లు, సకాలంలో లోడింగ్ చేయక వెయిటింగ్ చార్జీల రూపంలో రూ.28 వేలు వరకు వసూలు చేస్తున్నారు. వినియోగదారుడిపై రూ.15 వేల వరకు అదనపు భారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ఇసుకకు నిర్ణీత వ్యయం కన్నా దాదాపు రెట్టింపు వ్యయం అవుతోంది.

ఇసుకలో సముద్రపు ఉప్పునీటి సాంద్రతతో జిల్లాలోని ఆరు ఓపెన్ రీచ్‌లు, ఐదు డిసిల్టేషన్ పాయింట్లు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వెళ్లడంతో మూతపడ్డాయి. జిల్లా అవసరాల నిమిత్తం ఇసుక కోసం తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని పెండ్యాల, పందలపర్రు, గోపాలపురం తదితర ర్యాంపులకు వెళ్లాల్సి వస్తోంది. లోకల్ పేరిట అక్కడి స్థానిక కూటమి నాయకులు ర్యాంపుల వద్ద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. లోకల్ వాళ్లకే మొదటి ప్రాధాన్యత అంటూ ఇతర జిల్లాల లారీలు, ట్రాక్టర్ల లోడింగ్ అడ్డుకుని తమ వాహనాల్లో లోడింగ్ చేసుకుంటున్నారు. రెండు మూడు రోజులకు జిల్లాకు చెందిన వాహనాలకు ఒక్క ట్రిప్ లోడుకాని పరిస్థితులు ఉన్నాయి.

తీపర్రుతోనూ తీరని వెతలు

జిల్లా అవసరాల నిమిత్తం కలెక్టర్ సీహెచ్ నాగరాణి ప్రత్యేక చొరవ తీసుకుని తూర్పుగోదావరి జిల్లాలోని తీపర్రు, ఔరంగబాద్‌లోని ర్యాంపులను ప్రభుత్వం నుంచి కేటాయించేలా చేశారు. ఈ నెల 9 నుంచి తీపర్రు ర్యాంపులో లోడింగ్‌లు మొదలయ్యాయి. గత వారం రోజుల వ్యవధిలో కేవలం 210 వరకు లారీలు, ఉచిత ఇసుకకు సంబంధించి 28 ట్రాక్టర్లు మాత్రమే లోడయ్యాయి. ఇసుక లోడింగ్ కోసం రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని లారీ డ్రైవర్లు వాపోతున్నారు. ఉచిత ఇసుక కోసం ట్రాక్టర్‌కు రూ.600 వసూలు చేస్తున్నారు. కాకినాడ జిల్లాకు కూడా ప్రభుత్వం ఈ ర్యాంపునే కేటాయించింది. ఒక్క బాటే ఉండగా మూడు జిల్లాల నుంచి వచ్చే వాహనాలతో తరచూ ఇక్కడ ట్రాఫిక్ జామ్ సమస్య నెలకొంటోంది.

తీపర్రు నుంచి దూరం, ధరలు

నియోజకవర్గ కేంద్రం	దూరం (కి.మీ)	5 యూనిట్ల లారీకి	ప్రస్తుత ధర సుమారుగా
భీమవరం	54	రూ. 11,104	రూ. 24,000
నరసాపురం	44	రూ. 9,404	రూ. 20,000
పాలకొల్లు	35	రూ. 8,224	రూ. 19,000
ఉండి	58	రూ. 11,784	రూ.26,000
ఆచంట	29	రూ. 7,144	రూ. 16,000
తణుకు	13	రూ. 4,264	రూ. 14,000
తాడేపల్లిగూడెం	34	రూ. 8,044	రూ. 21,000

రూ. 5 వేల నుంచి రూ. 6 వేల అదనపు వసూళ్లు

టెండర్ ఖరారు చేసిన ధర మేరకు ప్రభుత్వం ర్యాంపుల్లో లోడింగ్ చార్జీలను నిర్ణయించింది. ఐదు యూనిట్ల లారీని నింపేందుకు దాదాపు 20 టన్నుల ఇసుక అవసరమవుతుంది. ఈ మేరకు తీపర్రు ర్యాంపులో టన్ను ఇసుకకు లోడింగ్ ధర రూ.96.02 కాగా, పెండ్యాలలో రూ.69, పందలపర్రు రూ.104.42, ఔరంగబాద్ (డీసిల్టేషన్ ర్యాంపు) రూ.229గా నిర్ణయించారు. ఈ లోడింగ్ చార్జీలతో పాటు లారీకి అదనంగా రూ. 5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నట్టు లారీ యూనియన్ నాయకులు చెబుతున్నారు. ఈ సొమ్ములు అధికార పార్టీ నేతల జేబులోకి వెళ్తున్నాయనే ప్రచారం ఉంది. అధికారులకు ఫిర్యాదు చేస్తే కొన్ని ట్రిప్పులు నిర్ణీత ధరకు వేస్తున్నారని, తర్వాత షరామామూలేనని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా చెప్పారు. ఔరంగాబాద్ ర్యాంపులో నిర్ణీత ధర కన్నా లారీకి రూ. ఏడు వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు.

రెట్టింపు రవాణ చార్జీలు

40 కిలోమీటర్లు లోపు దూరానికి టన్నుకు రూ.9 చొప్పున ఐదు యూనిట్ల లారీకి కిలోమీటరుకు రూ.180, 40 కిలోమీటర్లు దాటితే రూ. 8.5 చొప్పున రూ. 170గా ప్రభుత్వం నిర్ణయించింది. లోడింగ్ పాయింట్ వద్ద రెండు రోజుల వరకు లోడింగ్ కాని పరిస్థితి. దీంతో డ్రైవర్, క్లీనర్ జీతాలు, మెయింటెనెన్స్ రూపంలో రోజుకు రూ. 2 వేల నుంచి రూ.2,500 వరకు వెయింటింగ్ చార్జీలు వేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలపై నేరాలు అరికట్టేందుకు చర్యలు

సీఐడీ అదనపు ఎస్పీ అస్మ ఫర్హీన్ వెల్లడి



సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ అస్మ ఫర్హీన్

తణుకు: ఎస్సీ, ఎస్టీలపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీసు వ్యవస్థ మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాల్సి ఉందని సీఐడీ రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయం అదనపు ఎస్పీ అస్మ ఫర్హీన్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై శుక్రవారం తణుకులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై నేరాలు జరిగినప్పుడు బాధితులకు చట్టరీత్యా లభించే రక్షణ చర్యలను వివరించారు. ఈ కేసుల్లో అరెస్టులు జరుగుతున్నా సరైన శిక్షలు పడకపోవడంతోనే తిరిగి నేరాలు పునరావృతం అవుతున్నాయన్నారు. కోర్టుల్లో ట్రయల్ సమయంలో బాధితులు, సాక్షులు సరిగ్గా సాక్ష్యం చెప్పకపోవడంతో నిందితులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని అన్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు వారికి చెందాల్సిన హక్కులు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సదస్సులో తహసీల్దార్ అశోక్ వర్మ, ఎంపీడీవో జయసాగర్, రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.గోపాలరావు, తణుకు పట్టణ, రూరల్ సీఐలు ఎస్.కొండయ్య, బి.కృష్ణకుమార్, సంక్షేమ శాఖ అధికారులు శోభారాణి, నాగశేషమ్మ, న్యాయవాది జి.అంబేద్కర్, సీఐడీ సీఐలు కేపీ స్వామి, సీహెచ్ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ సీఐ కె.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం ధర్నా



భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

భీమవరం: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, మహిళలపై దాడులు అరికట్టాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని, ట్రూ అప్ చార్జీలు వసూలు నిలిపివేయాలని తదితర ప్రజా సమస్యలతో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ వంట నూనె, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ట్రూఅప్ చార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీవీ గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఉచిత ఇసుక విధానం అమలు చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు డి కళ్యాణి, పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యుడు కె రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ టిడ్కో ఇల్లు ఇప్పటికీ లబ్ధిదారులకు పూర్తిగా ఇవ్వలేదని, పట్టణంలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. శివారు ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు సమాన వేతనం ఇవ్వాలన్నారు. ధర్నాలో జుత్తిగ నర్సింహమూర్తి, కె.క్రాంతిబాబు, బాతిరెడ్డి జార్జి, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, కె.తవిటినాయుడు, దనికొండ శ్రీను, గొర్ల రామకృష్ణ, ఎస్కే వలి, ఇంజేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులపై దృష్టి సారించాలి

అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశం



నీటిపారుదల సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: రానున్న దాళ్వాలో సాగునీటి ఎద్దడి లేకుండా ఇరిగేషన్ పనులపై దృష్టి సారించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నీటి పారుదల సలహామండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 20 మండలాల్లోని 9 ప్రధాన కాలువల ద్వారా సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. రబీ పంటకు సాగునీరు కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని పక్కాగా అమలు చేయాలన్నారు. డిసెంబర్ 31వ తేదీలోగా జిల్లాలో అన్ని చేపలు, రొయ్యలు చెరువులు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, పశువులు, రజకుల చెరువులు పూర్తిస్థాయిలో నింపుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

అడ్డుకట్టల ద్వారా అధిగమించాలి

దాళ్వా పంటకు కొంతమేరకు నీటిలభ్యత తక్కువగా ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకుంటూ డ్రెయిన్లపై అడ్డుకట్టలు వేయడం, ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు, వంతులవారీ విధానం అమలు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చూడాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. కాలువలు మూసివేసే సమయంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులపై పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, భీమవరం నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి నాగార్జునరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, విద్యుత్ ఎస్ఈ ఎ.రఘునాథ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీవీ నాగేశ్వరరావు, జిల్లా డ్రెయినేజీ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, మత్స్య శాఖ అధికారి కే వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించాలి



శిక్షణ పొందిన ఐఏఎస్, ఐపీఎస్‌లతో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహూల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): క్షేత్రస్థాయిలో పరిస్థితులను అవగాహన చేసుకుని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రొహిబిషనరీ సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో పది మంది శిక్షణ అధికారులు కలెక్టర్‌ను కలిసి జిల్లాలో గత ఐదు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన, అవగాహన చేసుకున్న అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని, ఉత్తమ సేవలు అందించాలని వారికి సూచించారు. అనంతరం వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు కాత్యాయిని సింగ్, రూపాలి సున, భగత్ షమల్ కళ్యాణ్ రావు, నౌషీన్, శ్రీకృష్ణ, శ్రీరామ సుహెర్, యాష్ చంద్ర ప్రకాష్ సింఘాల్, లక్ష్మణ్ ఆనంద్, సుశాంత్ కుమార్, రాజేష్ కుమార్, అనికెట్ శాండిల్య, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్



సారా విక్రేతను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. రెండు లీటర్ల నాటు సారా కలిగి ఉన్న కె.రాంబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ ఆర్ సత్యవతి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పోక్సో కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన షేక్ షారూక్ ఖాన్ అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. సెప్టెంబర్ 30న మాయమాటలు చెప్పి బాలికను కడప తీసుకెళ్లి, ఒక ఇంట్లో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు గతంలో పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీఐ కృష్ణబాబు షారుక్‌ఖాన్‌ను అరెస్టు చేశారని చెప్పారు.

ఫుడ్‌జోన్‌లో తనిఖీలు



గ్యాస్ సిలిండర్లను చూపుతున్న అధికారులు

ద్వారకాతిరుమల: రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబుకు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని లక్ష్మీనగర్‌లో చాయ్ బిస్కెట్ ఫుడ్‌జోన్‌లో శుక్రవారం తనిఖీలు చేశారు. వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు గుర్తించారు. రూ.13,856 విలువైన, 5 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. రెస్టారెంట్ యజమాని బలే విఘ్నేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, సివిల్ సప్లయ్స్ డీటీ (ద్వారకాతిరుమల) పి.కామేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా బృందం క్షేత్ర పర్యటన



సీసలిలో చేపల చెరువును పరిశీలించిన బృందం

కాళ్ల: ఒడిశా రాష్ట్రం మత్స్యశాఖ బృందం కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం క్షేత్ర పర్యటన చేసింది. అత్యధిక దిగుబడి సాధిస్తున్న రైతులు పాటిస్తోన్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకుంది. సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు కాళ్ల గ్రామంలో స్పాన్ హేచరీలను పరిశీలించింది. ఒడిశా రాష్ట్రంలో వాటర్ స్ప్రెడ్ ఏరియా ఎక్కువగా ఉన్నప్పటికీ అధిక దిగుబడులు రావడంలేదని, తమ రాష్ట్రంలోని మత్స్య సంపదను మరింత మెరుగుపరచుకొనేందుకు క్షేత్ర పర్యటనకు వచ్చినట్టు మత్స్యశాఖ బృందం తెలిపింది. సీసలి, చినకాపవరం మత్స్యశాఖ సహాయకులు సత్యనారాయణ, అహ్మద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

యాత్రికులకు మహాప్రసాదం

- పంచారామక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం
- సాధారణ రోజుల్లో 3 వేలు, సోమవారం 15 వేల మందికి వితరణ
- భీమవరంలో భక్తులకు భోజన సౌకర్యం



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దృశ్యం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశం చౌక్) : కార్తీక మాసం సందర్భంగా భీమవరం పంచారామక్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారిని దర్శించుకునే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాదం అందిస్తున్నారు. స్వామి ప్రసాదాన్ని భక్తులు మహాప్రసాదంగా స్వీకరిస్తున్నారు. దర్శనం, భోజనం ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు అన్నదాన కమిటీ కార్తీక మాసంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేసేది. ప్రస్తుత కార్తీకమాసం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించారు. సాధారణంగా దేవస్థానంలో సుమారు 300 మందికి నిత్య అన్నదానం చేస్తున్నారు. ప్రస్తుత కార్తీక మాసంలో పంచారామక్షేత్రం వద్ద ఆది, సోమవారాల్లో 15 వేల మందికి, మిగిలిన రోజుల్లో మూడు వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నదానం ఉంటుంది. పప్పు, ఆకు కూరలు, పచ్చడి, పులిహోర, స్వీట్, పెరుగు, సాంబారు ఇలా మెనుతో అన్నప్రసాదం వడ్డిస్తున్నారు.

భోజనం ఇబ్బందులు లేవు

కార్తీక మాసంలో రాష్ట్రంలోని ఐదు పంచారామ క్షేత్రాలను భక్తులు ఒకే రోజు సందర్శిస్తారు. అమరావతి దర్శనం అనంతరం మధ్యాహ్నం భోజన సమయానికి భీమవరం పంచారామక్షేత్రాన్నికి చేరుకుంటారు. ఇక్కడ స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు హోటళ్లకు వెళ్లే ఇబ్బంది లేకుండా దేవస్థానం భోజనం ఏర్పాటు చేసింది. దీంతో దూర ప్రాంతాల భక్తుల భోజనానికి ఇబ్బందులు లేవు.

సంతోషంగా ఉంది



పంచారామ క్షేత్రాల దర్శనంలో భాగంగా అమరావతి దర్శనం చేసుకుని భోజనం సమయానికి భీమవరం వచ్చాం. స్వామి వారి దర్శనం అనంతరం దేవస్థానం వద్దే ఏర్పాటు చేసిన భోజనం చేశాం. మాలాంటి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వామి వారిని ప్రసాదాన్ని భోజనం రూపంలో స్వీకరించడం సంతోషంగా ఉంది.

– జి.నిష్మా నల్గొండ

గొప్ప కార్యక్రమం



భీమవరం పంచారామ క్షేత్రంలో అన్న ప్రసాదం స్వీకరించాం. భోజనం నాణత బాగుంది. యాత్రికులకు దేవస్థానం ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేయడం గొప్ప కార్యక్రమమం. కుటుంబ సమేతంగా వచ్చే భక్తులు స్వామి వారి దర్శనం అనంతరం హోటళ్లకు వెళ్లే ఇబ్బందులు ఉండవు. ఉచితంగా భోజనం వల్ల ఖర్చు ఆదా అవుతుంది.

– టి.వెంకటరత్నం బాపట్ల

నాణ్యతగల భోజనం



కార్తీక మాసంలో పంచారామక్షేత్రానికి వచ్చే భక్తులకు ఈ ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నాం. కార్తీక మాసం ఆది, సోమవారాల్లో రోజుకు 15 వేల మంది, మిగిలిన రోజుల్లో మూడు వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నాం. మధ్యలో దాతలు కూడా ఒక రోజు అన్నదానం చేస్తున్నారు. యాత్రికులకు నాణ్యత గల భోజనం అందిస్తున్నాం.

– డి.రామకృష్ణంరాజు, ఈఓ, పంచారామక్షేత్రం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: స్థానిక టు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని జువ్వలపాలెం రోడ్డులో ఈనెల 13న మోటారు సైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై రెహమాన్ శుక్రవారం తెలిపారు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన చల్లా వీరవెంకట సత్యనాగేంద్రబాబు, మరో వ్యక్తి మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్ ఢీకొట్టింది. దీంతో గాయపడిన వారిలో చికిత్స పొందుతున్న నాగేంద్రబాబు మృతం చెందినట్టు ఎస్సై రెహమాన్ చెప్పారు.

గూడెంలో గొర్రెల బండి



ఆకర్షిస్తున్న గొర్రెల బండి

తాడేపల్లిగూడెం : గుర్రపు బండి.. ఎడ్ల బండిని చూసుంటాం. కాని గొర్రెల బండిని చూసుండం. శుక్రవారం గూడెంలో గొర్రెల బండి సందడి చేసింది. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం అమృతపల్లి పుల్లయ్య అనే బాపూజీ ఈ బండికి పూల డెకరేషన్ చేసి ఆకర్షిస్తున్నారు. అమ్మవార్ల ఊరేగింపు, గొర్రెల లాగుడు పందాలు, సారెలు వంటివి వాటిని తీసుకెళ్లడానికి ఈ బండిని తీసుకుంటారని పుల్లయ్య తెలిపారు. పందేల్లో తమ బండి బహుమతులను సాధించిందన్నారు. ఈ బండిని బలుసులమ్మ ఆలయం వద్ద ఉంచడంతో పలువురు ఇక్కడ ఫొటోలు, సెల్ఫీలు తీసుకోడానికి ఆసక్తి చూపించారు.

విదేశీ అతిథులొచ్చాయ్



బి.కొండేపాడులో చెట్లపై నత్తగొట్టేళ్ల సందడి



కొండేపాడులో నత్తగొట్టేళ్లుగా పిలిచే కొంగల సందడి

పెంటపాడు: నత్తగొట్టేళ్లుగా పిలిచే విదేశీ కొంగలు పెంటపాడు మండలం బి.కొండేపాడులో సందడి చేస్తున్నాయి. మూడు నెలల క్రితం వచ్చిన ఈ నత్తగొట్టేళ్లు ఇక్కడే సంతానోత్పత్తి చేసుకొని తిరిగి స్వస్థలాలకు వెళతాయి. ప్రధానంగా ఎస్సీ పేటలోని తాటి, గానుగ, టేకు చెట్లపై అవి నివాసం ఏర్పరుచుకొన్నాయి. తెల్లవారుజాము 3 గంటలకు ఆహారం కోసం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల లోగా గూటికి చేరుతాయి. ప్రతి ఏటా మే నెలాఖరులో వచ్చే తొలకరి సందర్భంగా ఇవి గుంపులుగా వస్తాయి. ఇక్కడే 8 నెలల పాటు ఉండి గుడ్లు పెట్టి, పిల్లలను పొదిగి వాటికి రెక్కలు వచ్చాక తిరిగి మరలా ఫిబ్రవరి, మార్చి నెలాఖరులోపు స్వస్థలాలకు వెళతాయి. ఈ పక్షులు కొల్లేటి నుంచి వచ్చాయని కొందరు, పులికాట్ సరస్సు నుంచి వస్తున్నాయని మరికొందరు చెబుతారు. వాటి ఆకారం మామూలు కొంగలలా కాక పెద్ద చేపలను నోట కరచుకొనేందుకు వీలుగా ఐదు అంగుళాల ముక్కు, ఒక అడుగు పైగా కాళ్ల పొడవు, మెడ పైకి ఎత్తినప్పుడు రెండున్నర అడుగుల పొడవు ఉంటుంది. గుడ్లు పెట్టి పొదిగిన సందర్భంలో అవి గ్రామస్తులకు బెదిరి పారిపోకుండా నిశ్చింతగా ఉండటం గమనార్హం. గ్రామస్తులు కూడా వాటిని కన్న బిడ్డల్లా సాకుతుంటారు. కొల్లేరు, ఆటపాక పక్షుల విడిది కేంద్రంలా కొండేపాడును కూడా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ భూపతి రాజు పండేటి

పాలకోడేరు: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ లక్ష్యమని గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ భూపతిరాజు పండేటి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం దత్తత గ్రామమైన కోరుకొల్లులో గ్లోబల్ ఫౌండేషన్ మంతెన ప్రహల్లాద రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ 2021లో గ్లోబల్ ఫౌండేషన్‌ను స్థాపించి తెలుగు రాష్ట్రాల్లో 75 గ్రామాలను దత్తత తీసుకున్నట్టు చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ యోగీంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ మహత్కార్య కార్యక్రమంలో తమ సంస్థను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందన్నారు. వైద్య శిబిరంలో సుమారు 400 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంతెన భారతి, ప్రముఖ వైద్యులు పీఆర్‌కే వర్మ, వైస్ సర్పంచ్ గొట్టుముక్కల జయంతి, తిరుపతి రాజు, గాదిరాజు బాబు, పెద్ద చంటి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణవారిగూడెంలో భూ'మాయ'పై విచారణ

- జీలుగుమిల్లి తహసీల్దార్‌ను విధుల నుంచి తొలగింపు
- బయట పడిన నకిలీ హక్కు పత్రాల భాగోతం

సాక్షి స్పందన



ఆయిల్‌పామ్ తోటను ట్రాక్టర్‌తో దున్నిన గిరిజనేతరుడు

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్ట్ భూ సేకరణలో భాగంగా గిరిజన నిర్వాసితులకు భూమికి బదులు భూమి ఇవ్వగా, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం రెవెన్యూలో మిగిలి ఉన్న ప్రభుత్వ భూములు కాజేసిన వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఈ నెల నాలుగో తేదీన స్వర్ణవారిగూడెంలో భూ 'మాయ' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందించి కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశించారు. జీలుగుమిల్లి తహసీల్దార్ సందీప్‌ను విధుల నుంచి తొలగించారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతేడాది నవంబర్ 20న 31/1,31/2 సర్వే నెంబర్లలోని 4.62 ఎకరాల భూమిని మిగులు భూమిగా రెవెన్యూ అధికారులు చూపించారు. అయితే నకిలీ హక్కు పత్రంతో మడకం ఏసోబు అనే గిరిజనుడి పేరుతో ఓ గిరిజనేతరుడు సాగు చేస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. వాస్తవానికి ఏసోబు పేరున వేలేరుపాడు మండలం తాట్కూరుగొమ్ము రెవెన్యూలో సెంటు భూమి కూడా లేదని తేలింది. ఏసోబు తండ్రి రాజులుకు తాట్కూరుగొమ్ము రెవెన్యూలో 2.43 ఎకరాల భూమి ఉండగా, ఈ భూమికి ల్యాండ్ టు ల్యాండ్ కింద బుట్టాయిగూడెం మండలం బొద్దులవారిగూడెంలో 2.43 ఎకరాల భూమి అప్పగించారు. అంటే అవార్డులో లేని ఏసోబుకు నకిలీ హక్కు పత్రంతో వీఆర్వో, వీఆర్ఏ, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూమిని కట్టబెట్టినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ తహసీల్దార్ రామనాథం సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు గుర్తించారు. దీంతో 4.62 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణవారిగూడెంలో 43.33 ఎకరాల మిగులు భూమి ఉండగా, గత నెలలో 8 ఎకరాలే చూపించిన జీలుగుమిల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులు విచారణలో 16.48 ఎకరాలు చూపిస్తున్నారు. ఈ భూములు ప్రస్తుతం ఆక్రమణల్లోనే ఉన్నాయి. వీటిలో గిరిజనేతర రైతులు సాగుచేసుకుంటున్నారు. నకిలీ హక్కు పత్రాలతో ఎంత మంది భూములు ఆక్రమించుకున్నారన్న విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. వేలేరుపాడు మండల నిర్వాసితుల అవార్డు కాపీలు, పహణీలను అధికారులు పరిశీలిస్తున్నారు.

కిరాణా షాపుల యజమానులపై కేసులు



ఎల్బీచర్లలోని కిరాణా షాపుల్లో తనిఖీ

నరసాపురం రూరల్: నరసాపురం మండలం ఎల్బీచర్ల గ్రామంలో కిరాణ దుకాణ యజమానులపై కేసులు నమోదు చేశారు. 128 ఆహార పదార్థాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు నరసాపురం సివిల్ సప్లయిస్ డీటీ యాతం సత్యనారాయణ తెలిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఏఎస్ఆర్ రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఎల్బీచర్లలో వంకాలయ రాజు, ఆయన కుమారుడి కిరాణా షాపుల్లో దాడులు నిర్వహించారు. వీరిపై కేసులు నమోదు చేశామని డీటీ సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌కు బోరుగడ్డ అనిల్

వేలేరుపాడు: బోరుగడ్డ అనిల్ కుమార్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి శుక్రవారం అర్ధరాత్రి వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో అనిల్‌కుమార్‌పై గత రెండు నెలల క్రితం టీడీపీకి చెందిన ఉద్దగిరి రాణి అనే మహిళ ఫిర్యాదు చేసింది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టాడని పేర్కొంది. ఈమేరకు పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం జ్యూడిషియల్ కస్టడీకి పోలీసులు తీసుకున్నారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం విచారణ చేపట్టనున్నారు.

ముగ్గురి అరెస్ట్

భీమవరం: స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ డిపో వెనుక వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం : మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సీఐ కేఎస్‌వీ కళ్యాణ్ చక్రవర్తి వేరువేరు ప్రదేశాల్లో దాడులు చేశారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 8 డ్యూటీపెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు దుకాణాల సమాచారం ఉంటే ఫోన్ నెంబర్ 94409 02433కు తెలియజేయాలని కోరారు. ఈ దాడిలో ఎస్సైలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్‌తో అవకాశాలు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శాస్త్రి

భీమవరం: మెషీన్ లెర్నింగ్, డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ల సమన్వయంతో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో గొప్ప అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని రాధను టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ వీఎల్ఎన్ శాస్త్రి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంటిగ్రేషన్ ఆఫ్ మెషీన్ లెర్నింగ్ డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డేటా మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ ద్వారా మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుందని, ఈ సాంకేతికతను అనుసంధానించడం ద్వారా ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ మెరుగైన ప్రదర్శన, సమగ్ర ఎలక్ట్రికల్ సిస్టమ్స్‌లో సవాళ్లను అధిగమించవచ్చని శాస్త్రి తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ ఇంటిగ్రేషన్ ఆఫ్ మెషీన్ లెర్నింగ్ – డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్ అనేది విద్యుత్ వ్యవస్థల పనితీరును మెరుగునకు ఉపయోగపడుతుందని వివరించారు. ప్రిన్సిపాల్ ఎం అంజన్ కుమార్, ఈఈఈ డిపార్ట్‌మెంట్ హెడ్ కేబీవీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మామిడి పూత సంరక్షణలో జాగ్రత్తలు

పాడి - పంట



మామిడి చెట్టు నిండా ఉన్న పూత

నూజివీడు /చింతలపూడి : ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వైఎస్సార్ ఉద్యానవన యూనివర్శిటీ పరిధిలోని నూజివీడు మామిడి పరిశోధనాస్థానం శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి, చింతలపూడి ఉద్యానశాఖ అధికారిణి ఎండీ షాఫియా ఫర్హీన్ తెలిపారు. ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమైందన్నారు. మామిడి తోటల విస్తీర్ణం పెంచడానికి ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.7,980 రాయితీ అందిస్తున్నట్టు చెప్పారు. నవంబర్ నెలలో రాత్రి ఉష్ణోగ్రతలు 15–17 సెంటీగ్రేడ్ మధ్య రెండు వారాల పాటు ఉంటే మామిడి తోటల్లో పూతలు ప్రారంభం కావడానికి అవకాశం ఉంటుందని వివరించారు. మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారుల మాటల్లో..

పూత త్వరగా రావాలంటే..

ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి తోటల్లో పూత త్వరగా వచ్చేందుకు నీటిలో కరిగే నల్ల గంధకం 3 గ్రాములు, పోటాషియం నైట్రేట్ 5 గ్రాములు, సూక్ష్మధాతువుల మిశ్రమం 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. పూ మొగ్గలు, ఉత్తేజితమై పూత త్వరగా వస్తుంది.

చీడపీడలు, నివారణ చర్యలు

+ పూమొగ్గ దశలో తేనెమంచు పురుగులు, మొగ్గతొలుచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద, మసి తెగులు ఆశిస్తాయి. వీటి నివారణకు క్లోరీపైరిఫాస్ 50 ఈసీ 1 ఎంఎల్ లీటరు నీటికి లేదా లామ్డాసైహలోత్రిన్ 1 ఎంఎల్ లీటరు నీటికి లేదా స్పైనోటోరం 1 ఎంఎల్ లీటరు నీటికి లేదా క్లోరోథలోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటికి లేదా నల్లగంధకం 3 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- పచ్చిపూత దశలో తేనెమంచు పురుగు, ఆంథ్రక్నోస్, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ప్రొఫినోఫాస్ 50 ఈసీ 2 ఎంఎల్ లేదా డైమెథోయేట్ 30 ఈసీ 2 ఎంఎల్ లేదా, ఇమిడాక్లోప్రిడ్ 17.80 ఎస్ఎల్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి ఆకులు, కొమ్మలు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. వేప నూనె 10000 పీపీఎం 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. హెక్సాకోనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి లేదా కార్బండిజమ్ 1 గ్రా, మ్యాంకోజెబ్ 2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- నల్లపూత దశలో మామిడి నల్లపూత దశలో ఉన్నప్పుడు తేనెమంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు బుప్రోఫెజిన్ 20 శాతం, ఎసిఫెట్ 50 వాతం 1 గ్రా లీటరు నీటికి, స్పైనోసాడ్ 45 ఈసీ 0.3ఎంఎల్, థయోఫినెట్ మిథైల్ 1 గ్రా, క్లోరోథలోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటికి లేదా అజాక్సిరోబిన్ 2 ఎంఎల్ లీటరు నీటికి లేదా టెబ్యుకోనిజిల్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

క్లుప్తంగా

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి



కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు

తణుకు టౌన్: సినీనటుడు సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. తణుకులోని బాలాజీ టింబర్ డిపో ఆవరణలో జరిగిన కృష్ణ వర్ధంతి కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తణుకు తాలూకా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలంకి బాబ్జి గౌరవ అధ్యక్షుడు నమ్మి వాసు, కార్యదర్శి కర్రెళ్ల శ్రీనివాస్, కోశాధికారి పీవీవీఎస్ సత్యనారాయణ, రేలంగి శ్రీనివాసరావు, పళ్లెం నాగభూషణం, కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

బిర్సాముండా జీవితం ఆదర్శం



నిట్‌లో బిర్సాముండ చిత్రపటం వద్ద నివాళులు

తాడేపల్లిగూడెం: గిరిజనుల హక్కుల కోసం దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే శ్వేతజాతీయులను ఎదిరించి పోరాటం చేసిన మహా యోధుడు బిర్సాముండా అని శుక్రవారం ఏపీ నిట్‌లో జరిగిన బిర్సాముండా జయంతి వేడుకల్లో వక్తలు పేర్కొన్నారు. అసోసియేట్ డీన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డాక్టర్ కిరణ్ తీపర్తి మాట్లాడుతూ బ్రిటిష్ వారి వలస వాదంపై తిరుగుబాటు చేసి వారికి కంటి మీద కునుకు లేకుండా చేసిన ఆదివాసీ నాయకుడు బిర్సాముండా అన్నారు. ఆదివాసీలు చదువుకొని విద్యావంతులు కావాలన్నారు. ముందుగాబిర్సాముండా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్న మునిసిపల్ అధికారులు, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ అధికారులు పట్టణంలోని వివిధ ప్లాస్టిక్ అమ్ముతున్న హోల్ సేల్ షాపులలో, రిటైల్ షాపులు, వినియోగిస్తున్న చిరు వ్యాపారులు వద్ద నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులు, తదితర ఇతర ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని వారికి జరిమాన విధించారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు ఆదేశాలు మేరకు ఈ దాడులు జరుగుతున్నట్లు శుక్రవారం శానిటరీ ఇనెస్పెక్టర్ శ్రీమన్నారాయణ వెల్లడించారు. మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇనెస్పెక్టర్ సోమేశ్వరరావులు, జగ్గు నిరంజన రాము, శానిటరీ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటర్లీ, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్‌పోటీల్లో ప్రథమ స్థానం



బ్యాండ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పెద తాడేపల్లి గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన స్కాట్లాండ్ బ్యాగ్ పైపర్ బ్యాండ్ రాష్ట్ర స్థాయిలో జరిగిన బ్యాండ్‌పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ బి.రాజారావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు కర్నూలులో జరిగాయన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి మొత్తం 13 టీమ్‌లు పాల్గొనగా, తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు వివరించారు. ఈ నెల 16, 17వ తేదిల్లో కర్ణాటకలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ స్కూల్ బ్యాండ్‌పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొనున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

అత్తిలి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నిమిత్తం అత్తిలిలో ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ దశిక వంశీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి అవసరమైన సదుపాయాలు ఉన్నవి, లేనివి తనిఖీ చేశారు.

చేతులెత్తేసిన ఏజెన్సీ



మునిసిపల్ కమీషనర్ ఎం.ఏసుబాబుతో మాట్లాడుతున్న క్లాప్ ఉద్యోగులు



ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

- రోడ్డున పడ్డ 35 కుటుంబాలు
- ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికుడు

తాడేపల్లిగూడెం: క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)పేరిట పట్టణాలలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని భుజానికెత్తుకున్న ఏజెన్సీ గడచిన నాలుగు నెలలుగా ఈ బాధ్యతను పక్కకు తప్పుకుంది. యూజర్ చార్జీల పేరిట ఇంటింటి నుంచి సొమ్ములు వసూలు చేయగా వచ్చిన మొత్తంలో క్లాప్ స్కీమ్‌లో ఉద్యోగులుగా చేరిన వారికి జీతాలు, దీని కోసం కేటాయించిన వాహనాల నిర్వహణను భరించేవారు. యూజర్ చార్జీలను ప్రభుత్వం రద్దు చేయడంతో ఈ బాధ్యతను తీసుకున్న ఏజెన్సీ ఎలాంటి సమాచారం లేకుండా చెత్త సేకరణను మానేసింది. దీంతో ఈ స్కీమ్‌లో ఉద్యోగులుగా, డ్రైవర్లుగా చేరిన 35 మంది ఇంకా జీతాలు వస్తాయి. ఉద్యోగంలో ఉంటాం అనే భ్రమలో బతికారు. వాహనాలను షెడ్డులోకి చేర్చడం, జీతాల బకాయిలు విడుదల చేయక పోవడం వంటి కారణాలతో ఉద్యోగుల్లో ఆందోళన ప్రారంభమై, ఒక ఉద్యోగి బెంగతో ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో ప్రస్తుతం కోలుకుంటున్నాడు. మిగిలిన ఉద్యోగులు తమ బతుకు ఎలా అని వేదన చెందుతున్నారు.

బకాయిలు రూ.కోటీ 48 లక్షలు

క్లాప్ పథకం కింద వినియోగించిన వాహనాల నిర్వహణకు, ఈ స్కీమ్ కింద చేరిన 35 మంది ఉద్యోగులకు జీతాలు తదితరాల కింద సుమారు రూ.కోటీ 48 లక్షల రూపాయలు బకాయిలు ఏజెన్సీ నుంచి రావాల్సి ఉంది. ఏజెన్సీకి ప్రభుత్వం నుంచి కాని, పురపాలక సంఘం నుంచి కాని విడుదల చేయాలి. మునిసిపాలిటీలో సాధారణ నిధుల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో అటు ఏజెన్సీ నుంచి ఇటు మునిసిపాలిటీ నుంచి బకాయిల సొమ్ములు రాక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

చెత్త సేకరణపై ప్రభావం

క్లాప్ వాహనాలు ఆగిపోవడంతో ఆ ప్రభావం పట్టణంలో చెత్త సేకరణపై నేరుగా పడింది. లక్షా పది వేలు దాటి ఉన్న పట్టణంలో సుమారు 28వేల గృహాలు ఉన్నాయి. రోజుకు ఇళ్ల నుంచి వాణిజ్య సముదాయాల నుంచి 70 టన్నుల వరకు చెత్త వస్తుంది. ఈ చెత్తను గతంలో 34 వాహనాల ద్వారా తరలించేవారు. క్లాప్ వాహనాలు మూలన పడటంతో చెత్తసేకరణలో కొత్త సమస్యలు వచ్చాయి. వార్డుకు ఒక పుష్ కాట్ ఇస్తున్నారు. వార్డులో ఉన్న మొత్తం ఇళ్ల నుంచి చెత్తను ఇవి సేకరించే అవకాశం లేదు.

కార్మికులకు న్యాయం చేస్తాం
–కమిషనర్ ఏసుబాబు

క్లాప్ కార్మికులకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇవి మా చేతిలో లేదు. ఏజెన్సీ బకాయిలు పెట్టింది. ప్రభుత్వానికి కార్మికుల విషయాన్ని తీసుకెళ్లాం. క్లాప్ నిర్వహణ సమయంలో ఎరియర్స్ ఉంటే సాధారణ నిధుల లభ్యత ఆధారంగా కార్మికులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం.

ఎన్నికల కోడ్ ఉల్లం ‘ఘనులు’



దువ్వ జాతీయ రహదారి సెంటర్‌లో భవనంపై తొలగించని ఫ్లెక్సీ

తణుకు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. తణుకు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అధికార కూటమి పార్టీల నాయకుల ఫ్లెక్సీలే ఇందుకు నిదర్శనం. అధికారుల కళ్లముందే కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. తణుకు మండలంలోని దువ్వ, తేతలి, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో తెదేపా, జన సేన పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు విమరిస్తున్నారు. మరో ప్రక్క ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర నాయకుల ఫోటోలతో వేసిన ఫ్లెక్సీలు ఎక్కువగా ఉన్నాయి. దువ్వ సచివాలయం వద్ద సుమారు 6 ఫ్లెక్సీలు, వరిగేడు రోడ్డులో అలాగే శశి కళాశాల వద్ద ఎక్కడ చూసినా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అధికారులు వాటి ముందు నుంచే తిరుగుతున్నా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీన్ని బట్టి ఎన్నికల నియమావళి పట్ల అధికారులకు ఏమాత్రం గౌరవం ఉందో అర్థమవుతుంది.

దాతల సహకారం మరువలేనిది



ఇరగవరం హైస్కూల్లో దాతలు ఇచ్చిన సామగ్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

ఇరగవరం: దాతల సహకారం మరువలేనిదని ఎంఈవో ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో కొనుగోలు చేసిన విద్యార్థులు భోజనం చేయడానికి 12 టేబుల్, 60 కుర్చీలను శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు సమకుర్చడంలో విద్యాశాఖతో పాటు స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, దాతలు సహకరించడం ఎంతో మంచిది అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో పాటు దాతలు అందిస్తున్న సహాయ, సహకారలతో ఉన్నతంగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 జీబీవి ప్రసాదరావు, పి రేణుక, కె రామకృష్ణ, జె సుబ్బారావు, ఎస్ రామకృష్ణ, కె పాలేశ్వరరావు, ఫిజియోథెరఫిస్టు ఎ జగదీష్, గాలేశ్వరరావు, వై జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు కొమ్ముకాయడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం గ్రామంలోని జిల్లా పరిషత్ భూముల ఆక్రమణదారులకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్ కొమ్ము కాయడం దారుణమని ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం తన నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అయితే నిర్మాణాలు చేయడం సరికాదన్నారు. తీర్మానం ప్రతిని వారు మీడియాకు అందజేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి జిల్లా పరిషత్ భూములను పేదలకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు తులా మస్తాన్, ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు ముళ్లపూడి రామకృష్ణ, గోపిశెట్టి కోటేశ్వరరావు, రావి తాతరాజు, ఎం.విశ్వనాథం, రాటూరు సత్యనారాయణ, కరిపోతు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మధుమేహం నియంత్రణ



మధుమేహం జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేస్తున్న యోగా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డయాబెటిస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్స్‌క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణం రాజు పేర్కొన్నారు. మధుమేహ రుగ్మత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఉదయం స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లోని ఆవరణలో యోగా సభ్యులచే నిర్వహించిన శిబిరంలో షుగర్ వ్యాధి, అవగాహన సదస్సు, ఉచిత షుగర్ పరీక్షలు జరిగాయి. డయాబెటిస్ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేశారు. క్లోమ గ్రంధి, ఇన్సులిన్, జన్యుపరమైన అంశాలు, వంశపారంపర్యం, జీవన శైలిలో మార్పులు, డయాబెటిస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బడుగు చంద్రశేఖర్, ఆకుల సతీష్, రాము, నూకరాజు, సుధాకర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గుమ్మంపాడు లాకుల తలుపులు



గుమ్మంపాడు లాకుల వద్ద శిథిలావస్థకు చేరిన తలుపులు

అత్తిలి: మండల ప్రజలకు తాగు, సాగునీరు అందించే అత్తిలి కాలువపై ఉన్న గుమ్మంపాడు లాకుల శిథిలావస్థకు చేరింది. అత్తిలి కాలువ నుంచి బ్రాంచ్ కెనాల్స్ ద్వారా మండలపరిధిలో గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతోంది. గుమ్మంపాడు లాకుల వద్ద పడవల వెళ్లే మార్గంలో గేట్లు శిథిలావస్థకు చేరడంతో నీరు కిందకు వెళుతోంది. ప్రతి ఏడాది దాళ్వాసాగులో సాగునీటిఎద్దడి ఏర్పడుతుంది. దీంతో అధికారులు వంతులవారీ విధానంలో ఆయుకట్టు ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేస్తుంటారు. అయితే గుమ్మంపాడు లాకుల వద్ద ఉన్న గేట్లు తుప్పపట్టి రంధ్రాలు పడటంతో నీరు ధారాళంగా కాలువ దిగువ భాగానికి వెళుతోంది. ప్రస్తుతానికి నీటిఎద్దడి లేకపోయినప్పటికీ రానున్న దాళ్వాలో నీటి ఎద్దడి ఏర్పడుతుంది. ఆసమయానికి శిథిలావస్థకు చేరిన గేట్ల తలుపులు తొలగించి కొత్త తలుపులు ఏర్పాటు చేయడం ద్వారా సాగునీరు అన్ని ప్రాంతాలకు సక్రమంగా సరఫరా చేసే అవకాశం కల్గుతుంది. అత్తిలి కాలువపై పలు స్లూయిజ్ గేట్లు కూడా శిథిలావస్థకు చేరడంతో నీరు స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు వెళుతోందని, దీనివల్ల వంతుల వారీ విధానంలో సాగునీరు సరఫరా చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన లాకుల తలుపులను తొలగించి ఆధునికీకరించాలని రైతులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలు విజ్ఞాన గనులని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గరికిపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.జాన్‌బాబులు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పుస్తక ప్రదర్శనను అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రారంభించారు. విద్యార్థులు పుస్తకాలను పరిశీలించారు. పుస్తక పఠనం గావించారు. వక్తలు మాట్లాడుతూ సాంకేతికత పెరిగినా, చదివే శక్తిని కోల్పోకూడదని చెప్పారు. అనంతరం మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాలను వీడాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని, గంజాయి, సిగరెట్టులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధనరావు, లక్ష్మణరావు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



తణుకు టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు డా.రామబ్రహ్మం

తణుకు టౌన్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ టీ రామబ్రహ్మం చెప్పారు. జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన విద్యార్థులలో మెదడు సామర్ధ్యం తగ్గిపోయి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. గ్రంథాలయాలల్లోని గ్రంథాలను చదవడం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. తాము చిన్నతనం నుంచి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేశామని, నేటి బాలలు కూడా పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శశి విద్యా సంస్థల తణుకు కాంపస్ ఇన్‌చార్జి ఎస్ రాజేంద్రప్రసాద్, గ్రంథాలయ అధికారి సుగుణకుమారి, బెల్లంకొండ బుచ్చిబాబు, న్యాయ వాది కె వెంకటేశ్వర్లు, జీ ఉష, ఆర్ పృథ్వీ నారాయణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిలుకూరి సుజాత ప్రారంభించారు. తణుకు మండల వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధర్, వాకలపూడి నాగేశ్వరరావు, గుణ్ణం బసవయ్య, ఇంటి కృష్ణ మోహన్, ఉపాధ్యాయలు బీ సత్య గణపతి, అల్లాడ ఉదయలక్ష్మీ, గ్రంథాలయ అధికారి వై సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



అత్తిలి: శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ పౌరుడుగా తయారుకాగలడని రిటైర్డు గ్రంథపాలకుడు గంధం శేషవేంద్రరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. షేక్ నాగూర్ సాహెబ్ సహకారంతో 10 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాన్ని కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఆర్ దానకృష్ణ, బి మహాలక్ష్మి, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డా. గులాబ్ రాజ్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మసీ, కోల్డ్ చైన్ సిస్టమ్, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష, హెల్త్ సూపర్‌వైజర్ మోహనమ్మ, గ్రామ కార్యదర్శి సుష్మ, ఆరోగ్య సహాయకులు కే.వెంకటేశ్వరరావు, ఇ.కాంతారావు, ఆశాలు ఉన్నారు.

విప్రో క్యాంపస్ సెలక్షన్స్‌లో 14 మంది ఎంపిక

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని శ్రీరామా డిగ్రీ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి సంస్థ విప్రో నిర్వహించిన కాంపస్ ఇంటర్వ్యూలో తమ కళాశాల విద్యార్థులు 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఏఎస్ఆర్ విద్యా సంస్థల సీఈవో కే రాజశేఖర్ తెలిపారు. విప్రో సంస్థ హెచ్ఆర్ మేనేజర్ ఎం నరేష్ ఆధ్వర్యంలో నాలుగు దఫాలుగా నిర్వహించిన ఈఎంపికలకు జిల్లాలోని పలు కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. తమ కళాశాల నుంచి 14 మంది ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులను ఏఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఆకుల విజయవర్ధన్, ప్రిన్సిపాల్ వీవీ శ్రీనివాసులు అభినందించారు.

శంభో శంకర.. హరహర మహాదేవ



స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



తణుకు అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో పూలతో అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శంకరమఠంలో శంకరాచార్య, చంద్రమౌళీశ్వర ఆలయంలో స్పటిక లింగేశ్వరునికి వివిధ రూపాలలో పూజాదికాలు జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకుని శుక్రవారం శివుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భజనలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి.

వాసవిమాతకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శుక్రవారం పౌర్ణమి పురస్కరించుకుని వాసవి అమ్మవారికి విఘ్నేశ్వరీ పూజ, మూల విరాట్‌కు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో, ఫలరసాలతో విశేష అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి రజత చీరతో విశేష అలంకరణ గావించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు పేరూరి కాశయ్య పర్యవేక్షించారు. భక్తులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బలుసులమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలు, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో, పాలతో, నది జలాలతో, పసుపు, కుంకమలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళ భక్తులు విశేషంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందడి

తణుకు అర్బన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా తణుకు జాతీయరహదారి సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుస్వాములు వేమూరి చలపతి ఆధ్వర్యంలో నిత్య పూజారి సత్యనారాయణ సమక్షంలో పట్టణానికి చెందిన మణికంఠ (బాబి) సౌజన్యంతో తమలపాకుల సహస్రనామ పూజలతో పాటు 100కేజీల పూలతో ఆలయంలోని దేవతా మూర్తుల విగ్రహాల ముందు ప్రత్యేకంగా అలంకరించారు.